# కలసిన హృదయాలు

పి.వి. రాజు



యువ మాసపత్రిక

కార్యాలయము,

పబ్లిక్ గార్డెన్ రోడ్,

హైదరాబాదు — 1.

ది. 26-8-1980

సాహిత్యాభిలాషులు అనంత్‌గారికి,

ఇటీవల యువలో ప్రచురించిన 'కలసిన హృదయాలు' మీ కథ కాపీ కథ అని కొంతమంది పాఠకులు విమర్శిస్తూ ఉత్తరాలు రాశారు. మీ రెఫరెన్స్‌కోసం ఒక పాఠకుని ఉత్తరాన్ని పంపిస్తున్నాం. ప్రతికాముఖంగా జవాబిస్తారని ఆశిస్తాం.

—మీ ఎడిటర్.

షాక్ తిన్నట్టు ఫీలయ్యాను. ఒక పత్రికా కార్యాలయం నుంచి నాకింత వరకు ఇలాంటి ఉత్తరాలు రాలేదు. సుమారు అయిదు సంవత్సరాలుగా రాస్తున్న అనుభవం వున్న నాకు ఎవరి కథో కాపీచేయాల్సిన అవసరం లేదు. తమిళ కథను అనువాదం చేయవలసిన గత్యంతరం లేదు.

అయినా ఏమిటిది?

వణుకుతున్న చేతులతో ఆ పాఠకుని ఉత్తరం తీశాను.

మద్రాసు,
18-8-1980

యువ సంపాదకులకు,

గత సంచికలో మీరు ప్రచురించిన "కలసిన హృదయాలు" కథ జూన్ నెల మొదటివారంలో 'కుముదం' అనే తమిళ వార పత్రికలో ప్రచురించిన 'ఇరండు ఇదయంగల్' అను కథకు స్వేచ్ఛానువాదం అని తెలియజేయుడానికి విచారిస్తున్నాను. ఇలా ఇతర భాషల్లోని కథలను అనువదించి తమ కథలు అని చెప్పుకొనే ఆ కథా రచయిత ఒక రచయిత అని చెప్పుకోవడం సిగ్గుచేటు. కథా చౌర్యం క్షమించలేని నేరం. కనుక ఆ కథారచయిత తమిళ కథారచయిత్రి శారదగారికి క్షమాపణలు పత్రికా ముఖంగా చెప్పుకోవలసిందిగా కోరుకుంటున్నాను. ఇకనైనా ఇలాంటి కథలకు పత్రికలో చోటివ్వరని ఆశిస్తూ

మీ పాఠకుడు
సి. హెచ్. సూర్యనారాయణ

కోపం, అవమానంతో నాకు ఒళ్ళు మండిపోయింది. నేరాన్ని పాఠకుడు మోపాడు. నిర్దోషి అని నిరూపించుకొనే బాధ్యత రచయితగా నాకుంది. ఈ కథ నా స్వంత రచన అని నిరూపించుకోవలసిన అవసరం ఎంతైనా వుంది.

వెంటనే సెంట్రల్ లైబ్రరీకి వెళ్లాను. జూన్ నెల మొదటివారంలో 'కుముదం' తమిళ వారపత్రికలో ప్రచురించిన కథను వెతికితీశాను.

'ఇరండు ఇదయంగల్' కథారచయిత్రి శారద. రైలులో ఎదురెదురుగా కూర్చున్నట్లు హీరో; హీరోయిన్ల రంగులబొమ్మ పేజీనిండుగా రమ్యంగా వుంది. పేజీ త్రిప్పాను.

షాక్!

ఆ ఫోటో.... ఆమె.... ఆమె.... ఆమె నన్ను ఆర్నెల్ల గతంలోకి లాక్కెళ్లింది.

* * *

యూనివర్సిటీలో పని పూర్తిచేసుకొని తిరుపతి రైల్వేస్టేషన్‌కు వచ్చేసరికి "మీనాక్షి ఎక్స్‌ప్రెస్" మెల్లగా కదులుతోంది. టిక్కెట్టు తీసుకొని పరుగున రైలెక్కేశాను. రైలు వేగం పుంజుకొంది. కంపార్ట్‌మెంట్‌లో ఖాళీసీటు కోసం వెతుక్కొంటూ వెళ్లాను. ఎక్కడా లేదు. కాని అక్కడ!

ఒక్కడుగు ముందుకేసి మళ్లీ వెనక్కు వేశాను. ఆ క్షణంలో మెరిసిన మెరుపు తాలుకు వెలుగు నన్ను ధైర్యంతో ముందుకు అడుగేయనిచ్చింది.

"తమ్ముడూ! కాస్త జరుగుతావా?" అన్నాను ఆ సీట్లో కూర్చున్న కుర్రాన్నుద్దేశించి!

"పారకాక్కు! అవరెనుమో.... (చూడక్కా! అయనేమో....) అని

ఏదో తమిళంలో చెప్పబోయాడు ఎదురుగా కూర్చున్న మెరుపుకేసి అదోలా చూస్తూ!

ఆ మెరుపు వాడి అక్క అని, వారు తమిళీయులని అప్పుడు తెలిసింది. వెంటనే నా సంభాషణను తమిళంలోకి మార్చాను. తమిళంలో చెప్పేసరికి ఆ కుర్రాడు సంతోషంగా జరిగి చోటిస్తూ "వాంగో! వుక్కారంగో" (రండి కూర్చోండి) అన్నాడు.

"ఎంద వూరు వుంగల్దు?" (ఏవూరు మీది?) నుంచి ప్రారంభమయింది మా సంభాషణ.

సంభాషణంతా తమిళంలోనే సాగింది. కుర్రాడు, వాడి అక్క, నాన్న ముగ్గురు తిరుపతిలో వెంకటేశ్వర స్వామిని దర్శించడానికి వచ్చారని; స్వంతవూరు తిరుచురాపల్లి అని తెలుసుకొన్నాను.

ఆమె....! మెరుపు....!

ఆ విశాల నేత్రాలు, సూటి ముక్కు, వంపు తిరిగిన పెదవులు; పైపెదవి కుడివైపున పుట్టుమచ్చ - ఇట్టే ఆకర్షించే ఆ అందం.

శరీరవర్ణానికి అట్టే సరిపోయిన పసుపుపచ్చని అమెరికన్ జార్జెట్ చీరపైన అదేరంగు జాకెటు, భుజంమీదుగా ఒళ్లో పడిన పొడవైన నల్లని జడకొసను సుతారంగా చేతివేళ్లతో అల్లుకొంటున్న తీరు — దివినుండి దిగివచ్చిన దేవతగా బోలు- అన్నంత అమిత సౌందర్య లావణ్య అందాలరాశిలా ఆమె రూపం అద్భుతం.

వయసు ఇరవై ఏళ్లకంటె ఎక్కువ వుండదు.

నన్నింత ప్రమితంగా ఆకర్షించిన వనితామణి ఆమె. ఇంతివరకు ఎంతో మందిని చూశాను. కాని ఎవరిలోనూ ఇంత అందం, ఆకర్షణ లేదు.

ఆ అందాన్ని చూసే నా కళ్లలో మెరుపు మెరిసింది. ఆ తర్వాతే ఆ అందాన్ని తనివితీరా చూడాలనే చిలిపి కోరిక కలిగింది. అందుకే వెనక్కు వేసిన అడుగు ముందుకేసి ఆ కుర్రాడి ప్రక్కన సీటు సంపాదించాను.

ఇంతవరకు ఆడవారంటే అసహ్యించుకొనే నేను ఆమెవైపు చూడకుండా వుండలేకపోతున్నాను. 'పెళ్లి' అంటే ద్వేషించే నేను ఆ క్షణంలో 'పెళ్లంటూ చేసుకొంటే ఈమెనే చేసుకోవాలి. లేకుంటే నా బ్రతుకెందుకు' అనే స్థిర నిర్ణయానికి వచ్చేశాను.

ఆ కుర్రాడు ప్రశ్నలవర్షాన్ని కురిపిస్తూనేవున్నాడు. జవాబులిస్తూ వీలయినప్పుడంతా ఆ అందాలరాశిని చూస్తూనే వున్నాను.

ఆమె వెనక్కు వెళ్లే చెట్లవైపు, గుట్టలవైపు చూస్తోంది. పచ్చని అందమైన ఆమె మొహంపైన సాయంత్రపు నీరెండ పడి వింతకాంతు లీనుతోంది.

గాలికి చెదిరిపోయిన ఆమె ముంగురులు నుదుటిమీద నాట్యంచేస్తున్నాయి.

అలానే... ఇద్దరం.. ఎదురెదురుగా ఒకరి కళ్లలోకి ఒకరు చూస్తూ, ఒకరి భావాల్ని మరొకరు అర్థంచేసుకొంటూ ఇలానే... కలకాలం.... వుండిపోతే బావుణ్ణనిపిస్తోంది.

మెల్లగా ఆమెవైపు చూశాను. ఆ క్షణంలో ఆమెకూడా నా వైపే చూస్తూ చిన్నగా నవ్వుతోంది.

ఒక్క క్షణం... కళ్లు నాలుగూ కలిశాయి. వెంటనే వాలిపోయాయి.

'ఆమె కూడా నా గురించి ఆలోచిస్తోందా?'

ఆమె ముఖకవళికల్ని ఒక్కసారిగా చదవగలిగాను.

ఆమె భావాలు .. నా భావాలు

ఆమె ఆలోచన్లు నా ఆలోచన్లు_ ఏకం కావాలి! ప్రేమించేసుకొని, పెళ్లి చేసుకొని ఆనందదాంపత్యజీవన లాహిరిలో తేలిపోవాలని నా హృదయం ఘోషిస్తోంది.

ఇంత అందం నా సొంతంకావాలని, మూడుముళ్ల బంధంతో అది శాశ్వతం కావాలని నా హృదయకోవెలకు ఆమెను దేవతను చేసి నిత్యం ఆరాధించాలని ఎన్నెన్నో ఆశలు. ఎన్నెన్నో ఆలోచన్లు

తరంగాలు .తరంగాలుగా నా మదిని ఓలలాడిస్తున్నాయి. ఆమెతో మాట్లాడాలని ఉవ్విళ్లూరిస్తున్నాయి. తొందరపెట్టేస్తున్నాయి.

"నా కంటి వెలుగై
నా ఇంటి దీపమై
నా ప్రాణంలో ప్రాణమై
నన్నేలుకోవే - ఓహోహో! ఏమిటి కవిత్వం పుట్టుకొస్తోంది.

తల విదిలించి ఆమెవైపు చూశాను. అర్ధనిమీలిత నేత్రాలతో తలను కొద్దిగా ప్రక్కకు వాల్చి నా వైపు (దొంగ చూపులు) చూస్తూ దీర్ఘాలోచనలో వున్నట్లుంది.

బహుశా!

ఆమెకూడా నా వలె ఆలోచిస్తోందా?

'నన్ను గూర్చి ఆలోచిస్తోందా? అయితే ఏమిటబ్బా! నా వలె ప్రేమ.... పెళ్లిగూర్చి ఆలోచిస్తూ వుండాలి. యామై కరెక్ట్?'

ఏమో!

ఆడవారిని అర్థంచేసుకోవడం కష్టం.

ఆమె నా వైపు చిలిపిగా చూసింది.

ఆ చూపులో ఆరాధన!

అంతే!

ప్రేమిస్తోంది. అది పెళ్లికి దారి తీస్తుంది. ఆమె నా అర్ధాంగి అవుతుంది. అవుతుందా? ఉహుఁ!

ఎలా?

"మీరు నన్ను ప్రేమిస్తున్నారా?" అని ఆమెనే అడిగేస్తే?

ఆమెకోసం వచ్చి పబ్లిగ్గా అక్షింతలువేస్తే ఎవరైనాచూస్తే ఏమంటారు?

'ఆదర్శవాదిగా ఉండాల్సిన రచయిత చేయాల్సినపనేనా ఇది?' అని ఎవరైనా ఖమ్మకాలి అడిగితే నేను తలనెక్కడ దాచుకోవడం?– అంటూ ఆలోచిస్తూ వెలుపలికి తొంగిచూశాను.

అరె! అప్పుడే వచ్చేసిందా చిత్తూరు!

ఆశ్చర్యం!

దిగిపోతున్నారు జనం.

చేసేదేమీలేక అంత అర్జంటుగా వచ్చిన రైలును తిట్టుకొంటూ, అంత వరకు సీటునిచ్చిన అబ్బాయిని తెగ మెచ్చుకొని– (తమిళంలో) కృతజ్ఞతలు తెలుపుకొని–ఈ కార్యక్రమాలు చేస్తూ ఆమెను చూస్తూ – నాతోరానని మొరాయించిన హృదయాన్ని బలవంతంగా లాక్కొని దిగలేక, దిగలేక.... మనసు రాక, రైలు దిగాను. దిగేటప్పుడు మళ్లీ ఆత్రుత నణచుకోలేక ఆమెవైపు చూశాను.

చిరునవ్వు! ఒకే నవ్వు!

చాలు. జీవితం ధన్యం.

రైలు కదిలింది. తిరిగిచూద్దును గదా నా హృదయం రైలుతో పారిపోయింది

* * *

ఇది కథావస్తువు. ఈ రైలు ప్రయాణంలో నా ఆలోచన్లు .. దానికో రూపం .. చివరిలో ఇద్దరి పెళ్లి జరిగిపోవడం– ఇది కథలోని విషయాలు. అయితే ఇక్కడ పెళ్లి జరగడం తప్పించి మిగతా విషయాలన్నీ యథాతథంగా రాసినవే. కథకు ముగింపు కావాలి కనుక నాకు నచ్చిన అందమైన ముగింపు(పెళ్లి)తో కథ ముగించాను.

* *

"ఏమిటండి! ఆ ఫోటో వైపు అలా చూస్తున్నారు," అనే లైబ్రేరియన్ విషపు నవ్వుతో గతంలోంచి వర్తమానానికి వచ్చాను.



అదే రూపం.... అదే అందం.

అదే ఆకర్షణ అదే ఆరాధన- కథారచయిత్రిలో వుంది. పేరు శారద. తొలి కథ కావటంచేత రచయిత్రిని ఫోటోతో సహా పరిచయం చేశారు.

ఆ తర్వాత కథను చకచకా చదివేశాను.

అదే రైలు ప్రయాణం... అవే అనుభవాలు అవే అలోచన్లు. పెళ్లితో కథ ముగింపు- అంతా ఒక్కటే.

భాషలో తప్పించి భావాల్లో బేధం లేదు.

'నా హృదయం చిత్తూరులోనే వదిలేశాను' అంది.

ఆ ఒక్క వాక్యమే నా మనసులో వేణువు లూదింది. ఆమె నన్ను మనసారా ప్రేమిస్తోంది. ఇద్దరూ ఒకర్నొకరు ప్రేమించుకొన్నాం. కానీ పిరికివాళ్లం, మనసు విప్పి మాట్లాడుకోలేదు.

ఇద్దర్లో మెదిలిన భావాలు కథకు రూపాలు దాల్చాయి.

ఆ కథలే మమ్మల్ని కలిపాయి.

* * *

6-1-68, బజారు వీధి,
సంతపేట, చిత్తూరు.
10-10-1980

యువ సంపాదకులకు,

నమస్సుమాంజలి.

26-8-80వ తేది మీ ఉత్తరం అందింది. చాలా థ్యాంక్స్. ఎందుకంటే మీరు, పాఠకులు విమర్శద్వారా నిజంగా కథకు వూపిరిపోశారు. మా రెండు హృదయాలను కలిపారు.

ఇక నా కథ కాపీ కథ అని విమర్శించారు. తమిళ రచయిత్రి శారదగారి కథ 'కుముదం' లో జూన్ మొదటి వారంలో ప్రచురింపబడింది. నా డైరీ ప్రకారం నేను నా కథను 16-5-80వ తేది మీకు పోస్టుచేశాను. కనుక ఆమె కథను నేను కాపీచేసే ప్రసక్తే లేదు.

ఒక రైలులో మేమిద్దరం కలిసి ప్రయాణం చేశాం. అప్పుడు ఇద్దర్లో కలిగిన ఆలోచనాభావతరంగాలే మా కథకు కథావస్తువులు. ఇద్దరూ మనసుల్లో ఆశించిన ముగింపే కథలకు అన్వయించాం.

ఆమె అనుభవాలు ఆమె తమిళ కథగా రూపొందించింది. అలాగే నా భావాలు తెలుగుకథగా రూపొందించాను.

ఇద్దరికీ ఒకే అనుభవాలు.... ఒకే ముగింపు రావడం ఆశ్చర్యమే!

సహృదయులైన పాఠకులు అర్థం చేసుకొంటారని ఆశిస్తాను.

విడిపోయిన మా రెండు హృదయాల్ని మళ్లీ కలపడానికి దోహదం చేసిన పాఠకుడు శ్రీ సి. హెచ్ సూర్యనారాయణగారికి, మీకు నా కృతజ్ఞతలు మరోసారి అందజేసుకొంటున్నాను.

ఇట్లు
మీ అనంత్.

---